గ్రాసం పెంపకం లాభదాయకం

- గ్రాసంతో పాల దిగుబడి పెరుగుదల
- సమతుల గ్రాసం మేలు
- పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రసన్నబాయి

తలుపుల: పాడి రైతులకు పశుగ్రాస పెంపకం లాభదాయకంగా మారుతోంది. ఒక్కో పాడి పశువుకు రోజుకు 30 నుంచి 40 కిలోల మేత అవసరం. ఒక వంతు పప్పుజాతి, రెండు వంతులు ధాన్యపు జాతి గ్రాసాలు అందిస్తే పాల దిగుబడి పెరగడంతో పాటు ప్రస్తుత సీజన్‌లో పశువులకు మేలని పశుసంవర్ధక శాఖ ఏడీ ప్రసన్నాబాయి తెలిపారు. పశుగ్రాసం పెంపకంలో పాటించాల్సిన మెలకువలపై పాడి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రతి రైతూ ఏ పంట సాగు చేసినా ఖర్చుతో కూడుకున్న పనే. ఏటా రెండు పంటలు సాగు చేసినా ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేలకు మించి రాదు. అదే గ్రాసం ఎకరా సాగు చేసి 4, 5 పాడి ఆవుల పెంపకం చేపడితే నెలకు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా ఆదాయం పొందే అవకాశం ఉంది. పశువులకు పచ్చి మేత పుష్కలంగా అందిస్తే 5 లీటర్ల నుంచి పది లీటర్ల వరకు పాల దిగుబడి పొందవచ్చు. ధాన్యపు జాతి పశుగ్రాసాల సాగుకు యూరియా వాడకంతో దిగుబడి ఎక్కువగా లభిస్తుంది. పూత దశలో కోసి పశువులకు వేయడం మంచిది.

పప్పుజాతి పశుగ్రాసాలతో..


ప్రసన్నాబాయి, పశుసంవర్ధకశాఖ ఏడీ

పప్పు జాతి పశుగ్రాసాల సాగు వల్ల నత్రజని భూమిలో వృద్ధి చెందుతుంది. భూసారం పెరగడంతో పాటు నేల కోతను అరికట్టవచ్చు. కలుపు నివారించవచ్చు. నీటి తడుల సాగులో నత్రజని వంటి సూపర్ ఫాస్పేట్ వంటి ఎరువులు వేయాల్సి ఉంటుంది. ఎకరం పొలంలో జనుము సాగు వల్ల 40 కిలోలు, అలసంద సాగుతో 30 కిలోలు, లూసర్న్ సాగుతో 20 కిలోలు, సుబాబుల్ సాగుతో 50 కిలోల నత్రజని సమకూరుతుంది. పశువులకు ధాన్యపు జాతి, పప్పుజాతి పశుగ్రాసాలను 2:1 నిష్పత్తిలో అందించడం వలన పోషక పదార్థాలన్నీ ఏక కాలంలోల భ్యమవుతాయి. ధాన్యపు జాతి పశుగ్రాసాన్ని, పప్పు జాతి పశుగ్రాసాన్ని మిశ్రమ పంటగా సాగు చేయాలి. మిశ్రమ పంటల వల్ల పప్పుజాతి పశుగ్రాసాలు ముదిరినా నాణ్యత కలిగి ఉంటాయి. క్యాల్షియం వంటి ఖనిజ లవణాలు లభించి వరిగడ్డిలోని ఆక్సిలేట్లు విషపదార్థాల ప్రభావాన్ని నశింపజేస్తాయి.


పశుగ్రాసం పెంపకం

పాడి రైతుకు ఎంతో తోడ్పాటు

పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్రతి రైతుకూ పచ్చి మేత తప్పనిసరిగా సాగు చేయాలి. ప్రతి రైతూ తనకున్న పొలంలో పదో వంతు భూమిని పశుగ్రాసాల సాగుకు కేటాయించాలి. పశుగ్రాసాలు ఏడాదిలో 3 నుంచి 5 కోతలు వస్తాయి. వీటిని ఏక వార్షిక కాలం అంటారు. వీటిని వర్షాధారంగా సాగు చేసుకోవచ్చు. బహువార్షికాలు ఒకసారి నాటితే నాలుగైదేళ్ల దిగుబడినిస్తాయి. నీటి సౌకర్యం ఉన్న సందర్భాల్లో బహువార్షిక గ్రాసాలు సాగుచేసుకోవచ్చు. పశుగ్రాసాల్లో ధాన్యపు జాతి, పప్పుజాతి అని రెండు రకాలుంటాయి. వీటిలో పిండి పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. కంకులు ఉండడం వలన పిండి పదార్థాలు లభిస్తాయి. పప్పుజాతి పశుగ్రాసాలు కాయలు కాస్తాయి. వీటిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. పాడి పశువులకు పచ్చి మేతను సమతులంగా అందజేయడం వల్ల పాడి పరిశ్రమ అభివృద్ధికి ఎంతో తోడ్పాటుగా ఉంటుంది.

క్లుప్తంగా

న్యాయవాదుల షటిల్ టోర్నీ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ధర్మవరం అర్బన్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన న్యాయవాదుల షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులను బార్ అసోసియేషన్ సభ్యులు అందించారు. గత 4 రోజులుగా జరుగుతున్న షటిల్ టోర్నీలో బుధవారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. ఇందులో గెలుపొందిన న్యాయవాదులకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు కరీం ఆధ్వర్యంలో బహుమతులు అందించారు. న్యాయవాదులు రామకృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్, నూర్ మహమ్మద్, కృష్ణయ్య, రాఘవేంద్ర, గోపికృష్ణ, బాబా, పెద్దన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గాండ్లపెంట: కదిరి నుంచి రాయచోటికి వెళ్లే ప్రధాన రహదారి పనులను బుధవారం మద్దివారిగొంది పంచాయతీ కమతంపల్లి కల్వర్టు వద్ద ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడడంతో ఆ గుంతలను మట్టితో ఇరువైపులా పూడ్చి రోడ్డు మరమ్మతులు చేపట్టారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రమణయ్య


ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్లను సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరం అర్బన్: ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా జూటూరు రమణయ్యను ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పట్టణంలోని ఆర్యవైశ్య పాత సత్రంలో బుధవారం నూతన కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా జూటూరు రమణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యల్లంపల్లి సుదర్శన్‌గుప్తను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా నియమించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు కోటి లక్ష్మీవెంకటేశ్వర్లు, కలవల రామ్‌కుమార్, కలవల మురళీధర్, జయంతి వినోద్‌కుమార్, కర్ణాటక ముకుంద, గోపా చంద్ర, ఓవీ ప్రసాద్, కాకుమాని శ్రీహరి, రేపాకుల సురేష్‌బాబు, గాయత్రి రామకృష్ణ, పెనుజూరు నాగరాజు, బండ్లపల్లి రంగనాథ్, గ్రంధే శ్రీనివాసులు, కాకుమాని సాగర్, మైలవరం సాయినాథ్, గాదంశెట్టి శ్రీనివాసులు, మోకా గోపి, పాలమడ కృష్ణ, అంబటి శ్రీధర్, గర్జాల అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కండక్టర్‌గా ప్రభాకర్


తలుపుల ప్రభాకర్

కదిరి అర్బన్: కదిరి డిపోలో ఉత్తమ సేవలు అందించిన కండక్టర్ తలుపుల ప్రభాకర్ రీజియన్ స్థాయిలో ఉత్తమ కండక్టర్‌గా ఎంపికయ్యారు. స్వాతంత్య్ర దినోత్సవం రోజున రీజనల్ మేనేజర్ మధుసూదన్ చేతుల మీదుగా ఈయన ఉత్తమ అవార్డు అందుకోనున్నారు. 2023–24లో 77634 కిలోమీటర్లు సర్వీసు చేసి రూ.4.39 లక్షలు ఆదాయం తీసుకొచ్చారు. కిలోమీటర్‌కు 56.65 చొప్పున ఆదాయం అందజేశారు. 365 రోజులకు గాను 289 రోజులు పని చేశారు. ప్రభాకర్‌ను డీఎం మైనోద్దీన్, ఎస్‌ఎంయూ నాయకులు బైరిశెట్టి, ఎన్వీ రమణ తదితరులు అభినందించారు.

స్నేహితుల ఔదార్యం


నాగేంద్ర కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

కనగానపల్లి: కష్టాల్లో ఉన్న మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి బాల్య స్నేహితులు ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాలు.. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కనగానపల్లికి చెందిన సాకే నాగేంద్ర మృతి చెందాడు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న మిత్రుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు బాల్య స్నేహితులు ముందుకొచ్చారు. చందాలు వేసుకుని సేకరించిన రూ.60,500 మొత్తాన్ని బుధవారం మృతుడి భార్య లక్ష్మి, కుమార్తెలకు అందజేశారు. కార్యక్రమంలో అంకె హరి, బట్టా రాజేష్, నాగ మునీంద్ర, విజయ్, గోవిందు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించండి

తాడిమర్రి: పంటలు సాగు చేసుకున్న రైతులు ఈ క్రాప్ నమోదును తప్పని సరిగా చేయించుకోవాలని ఏఓ రమాదేవి రైతులకు సూచించారు. బుధవారం మర్రిమాకులపల్లిలో రైతులతో కలిసి ఈ పంట నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగరాలి


ధర్మవరంలో జాతీయ జెండాతో విద్యార్థులు


కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: జాతి సమైక్యతను చాటడానికి ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు హరీష్ తెలిపారు. పట్టణంలో బుధవారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. భారీ జాతీయ జెండాను విద్యార్థులు చేత పట్టుకుని ర్యాలీ చేశారు. స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించుకుని వారి అడుగుజాడల్లో నడవాలని బీజేపీ నాయకులు సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు. అనంతరం అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు అంబటి సతీష్, జింకా చంద్రశేఖర్, సాకే ఓబిలేసు, గుండా పుల్లయ్య, శంకర్ చంద్రశేఖర్, గిర్రాజు నగేష్, గొట్లూరు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: భారత ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం హర్ ఘర్ తిరంగ్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జెడ్పీ హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాయకులు తలుపుల గంగాధర్, కేశవరెడ్డి, రమేష్‌బాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఎన్‌సీసీ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ ఎస్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ చెన్నేకొత్తపల్లిలోని న్యామద్దెల సర్కిల్ వరకూ సాగింది. అక్కడ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత మాట్లాడుతూ.. స్వాతంత్య్రం కోసం ఎందరో ప్రాణాలను త్యాగం చేశారన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచులు కీలకం

ఎన్‌పీకుంట: గ్రామాల అభివృద్ధిలో సర్పంచులే కీలకమని ఈఓఆర్డీ మనోహర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయితీల అభివృద్ధిపై మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. వీధిదీపాల నిర్వహణ పె అవగాహన కల్పించారు.

గాండ్లపెంట: మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులుగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. పంచాయితీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా పంచాయతీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. మూడో రోజు శిక్షణకు 14 మంది సర్పంచ్‌లకు గాను కురుమామిడి సర్పంచ్ ఒకరు, 9 పంచాయతీ కార్యదర్శులకు నలుగురు మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీఓ రామానాయక్, ఈఓఆర్డీ సునిత పాల్గొన్నారు.

ముదిగుబ్బ: పంచాయతీల అభివృద్ధికి పాటుపడదామని ఎంపీడీఓ కవిరాజ్ సర్పంచులు, కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించారు.

కనగానపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల నిధుల సద్వినియోగంపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా జరిగిన శిక్షణ బుధవారం ముగిసింది. అధికారులతో కలసి సర్పంచులు, కార్యదర్శులు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: కేరళ వయనాడ్ వరద బాధితులకు నిధులు ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి విద్యాగిరి ఆర్చి వరకు బ్యానర్ పట్టుకొని విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వానకు కేరళ ప్రాంతం వయనాడ్‌లో సర్వస్వం కోల్పోయన్నారు. మానవతాదృక్పథంతో మనం వారిని ఆదుకోవాలని కోరారు. ఈసందర్భంగా విరాళంగా వచ్చిన రూ.8,610 కేరళ సహాయనిధికి జమజేశారు. కార్యక్రమంలో నాయకులు పైపల్లి గంగాధర్, పెడపల్లి బాబా, సుధాకర్, రమేష్, నాగార్జున, రామయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: కేరళ వయనాడ్ వరద బాధితులకు సహాయార్థం సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నేతలు పట్టణంలో బుధవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగి 400 మందికి పైగా చనిపోవడం బాధాకరమన్నారు. ఈసందర్భంగా రూ.10,240 విరాళం సేకరించారు. ఈ మొత్తాన్ని కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తామన్నారు. నేతలుమాబున్నీషా,సుజాత,భాగ్యమ్మ, ఈశ్వరమ్మ, జగన్మోహన్, బాబ్జాన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదానం శిబిరంలో ట్రస్ట్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రాకింగ్ స్టార్ డ్యాన్స్ స్కూల్ అకాడమీలో బుధవారం రజిని హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్, రక్తబంధం ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా 30 మంది యువత రక్తదానం చేశారు. రక్తబంధం ట్రస్ట్ వ్యవస్థాపకులు కన్నా వెంకటేష్ మాట్లాడుతూ తలసీమియా చిన్నారులకు ఈ రక్తాన్ని అందిస్తామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు జయప్రకాష్, ఉదయ్‌కుమార్, చంద్రశేఖర్, శంకర్, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ధర్మవరం రూరల్: సీతారాంపల్లి వద్ద ఉన్న కెఎఫ్‌సీ సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గంతిమర్రి గ్రామానికి చెందిన మోపూరి రంగన్న బైక్‌పై అనంతపురం వైపు వెళుతుండగా వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ధర్మవరం ఆసుపత్రికి తరలించారు.

సజావుగా మండల మీట్

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటుగా సర్పంచులు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యుడు అందరూ హాజరయ్యారు. అధికారులు ఆయా శాఖల వారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. జెడ్పీటీసీ కవిత, ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ రామనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ బాలికలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ


స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: బుక్కపట్నం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బుధవారం విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ అందజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి పథకం కింద ఎస్సీ, ఎస్టీ బాలికలకు స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్నట్లు లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణ, ఎస్సీ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్ పేర్కొన్నారు. 5,6,7 తరగతుల విద్యార్థినుల ఏడాదికి రూ.3 వేలు, 8, 9, 10 తరగతులకు రూ.5 వేల చొప్పున జిల్లాలోని 37 కెనరా బ్యాంకు శాఖల ఆధ్వర్యంలో అందిస్తున్నట్లు చెప్పారు. మేనేజర్ కిరణ్‌కుమార్, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

పుట్టపర్తి: బుక్కపట్నంలోని ఎస్ఎస్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు మూడు రోజుల నుంచి నిర్వహించిన శిక్షణ బుధవారంతో ముగిశాయి. వ్యాపార నిర్వహణ, శక్తి సామర్థ్యంపైన ఉచిత శిక్షణ ఇచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధిఅధికారి అబ్దుల్ ఖయ్యూమ్ పేర్కొన్నారు.

అసైన్డ్ భూములపై రీ వెరిఫికేషన్ చేయండి


వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి

బత్తలపల్లి: అసైన్డ్ భూములపై గత ప్రభుత్వంలో యాజమాన్య హక్కులు(ఫ్రీ హోల్డ్) పొందిన రైతన్నల భూములను మరోసారి రీ వెరిఫికేషన్ చేయాలని ధర్మవరం ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అసైన్డ్ భూముల చట్టసవరణ ద్వారా ఫ్రీ హోల్డ్ అయిన భూముల రిజిస్ట్రేషన్ల ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ భూములన్నింటిపైనా త్వరితగతిన విచారణ నిర్వహించాలన్నారు. ఢీ ఫారం పట్టా ఎవరి పేరున ఉంది? ఎవరి పేరుతో మార్పు జరిగింది? తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పలు అంశాలపైన వారికి సూచనలు, సలహాలు అందజేశారు. సీఎస్‌డీటీ శారద, మండల సర్వేయర్ జోసఫ్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

చెన్నేకొత్తపల్లి: దళిత, గిరిజనుల భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ హమీద్‌బాషాను కలసి సమస్యలను వివరించారు. పెద్దమొగలాయపల్లి, వెంకటాంపల్లి మేడాపురం, బసంపల్లి గ్రామాలతో పాటు అనేక గ్రామాల్లో భూ సమస్యలు ఉన్నాయన్నారు. పెద్దమొగలాయపల్లిలో సర్వే నంబర్ 225–4లో దళితులకు చెందిన 3.80 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారుల అండదండలతో అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారన్నారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితుడు రెండు రోజుల క్రితం సెల్ టవర్ ఎక్కినట్లు గుర్తు చేశారు. పలుమార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ చూట్టూ తిరిగి మొరపెట్టుకున్నా ఫలితం లేదన్నారు. బసంపల్లి గ్రామంలో దళితులకు చెందిన స్మశాన వాటిక భూమిని కూడా కొందరు కబ్జా చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం లింగన్న, సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, అంబేడ్కర్ సేన పెదన్న, రామకృష్ణ, నరసింహులు, హరికృష్ణ బాధితులు లక్ష్మీదేవి, రమణ, కృష్ణ, ఓబుళేసు, గోపాల్ పాల్గొన్నారు.

నిందితులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ శ్రీలత, సీఐ నారాయణరెడ్డి

కదిరి టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పలు కేసుల్లో నిందితులకు డీఎస్పీ శ్రీలత బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి, మట్కా, క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో నిందితులుగా ఉన్న వారితో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తతో మెలగాలన్నారు. అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేస్తామన్నారు. అనంతరం వారిని కదిరి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. సీఐ డీవీ నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

వెంగమునిస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

ముదిగుబ్బ: టీఎస్ పాల్యంలో వెంగముని స్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ముదిగుబ్బలోని పెద్ద బాలముని నివాసం నుంచి టీఎస్ పాళ్యంలో వెంగముని స్వామి వద్దకు గంధం పూలతో తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. పూజారి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారిని పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఆరాధనోత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

కేబుల్ చోరీ

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలోని వ్యవసాయ పొలంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు బోరుబావి మోటర్‌కు అమర్చిన స్టాటర్ పెట్టె సామగ్రితో పాటు కేబుల్ చోరీ చేశారు. బాధిత రైతులు శ్రీనివాసులు రెడ్డి, గోవిందురెడ్డి, రమణ, గోపాల్‌కృష్ణ బుధవారం కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాత్రి వేళలో గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ పొలం గేటు తాళాలు పగలగొట్టారని తెలిపారు. లోపలికి వెళ్లి బోరుబావికి అమర్చిన స్టాటర్ పెట్టలోని ఎలక్ట్రికల్ సామగ్రితో పాటు 30 మీటర్ల సర్వీస్ వైరు కత్తిరించుకుని వెళ్లారన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు


ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పగిస్తున్న సెబ్ పోలీసులు

బత్తలపల్లి: మండలంలోని చిత్రావతి నది, ఇతర ప్రాంతాల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఎస్‌ఐ సోమశేఖర్‌మూర్తి హెచ్చరించారు. బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రాప్తాడు మండలం ఎర్రగుంటకు చెందిన ట్రాక్టర్‌ను, డ్రైవర్ నారాయణస్వామిని సెబ్ సీఐ స్టేషన్‌లో అప్పగించగా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు


కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధర్మవరం నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈమేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు


కబడ్డీలో తలపడుతున్న విద్యార్థినులు

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీం భగత్‌సింగ్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా టీం భగత్‌సింగ్ అధ్యక్షుడు ఎం. యోగి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు అద్భుతమైన క్రీడా నైపుణ్యాలను కలిగి ఉంటారన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించామని, విజేతలకు ఆగస్టు 15న పాఠశాలలో బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు హరిప్రసాద్‌రెడ్డి, సురేష్, ముబారక్, ఇర్ఫాన్, యోగంధరరెడ్డి, నాగార్జున, టీం భగత్‌సింగ్ సభ్యుడు హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ సీఐగా సునీత



పుట్టపర్తి టౌన్: స్థానిక అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పుట్టపర్తి సీఐగా సునీత బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారులు ఇక్కడ పని చేస్తున్న సీఐ కొండారెడ్డిని వీఆర్‌కు పంపుతూ డీటీసీ పని చేస్తున్న సీఐను ఇక్కడికి బదిలీ చేశారు. ఈసందర్భంగా నూతన సీఐకి ఎస్‌లు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. అందరికీ అందుబాటులో ఉండి సేవలందిస్తానని నూతన సీఐ పేర్కొన్నారు.

చెన్నేకొత్తపల్లి తహసీల్దార్‌గా అనురాధ



చెన్నేకొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా ఎస్.అనురాధ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న హమీద్ బాషా పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజా సమ్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

వాల్మీకి బోయ సంఘం లీగల్ అడ్వయిజర్‌గా రాజేశ్వరి

పుట్టపర్తి అర్బన్: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం(ఏపీవీబీఎస్) లీగల్ అడ్వైజర్‌గా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి నియమితులయ్యారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విక్రం నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఈసందర్భంగా ఆమె పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విక్రంనాయుడు, జక్కల శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి

కదిరి టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలని సీఐ డీవీ నారాయణరెడ్డి కోరారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై అడ్డదిడ్డంగా ప్రైవేట్ బస్సులు, ఆటోలు, తోపుడు బండ్లు, ఇతర వాహనాలు ఉంచరాదన్నారు. మదనపల్లి, హిందూపురం, అనంతపురం, రాయచోటి రోడ్లలో ఉన్న షాపుల యజమానులు వారి షాపుల ముందు పార్కింగ్ స్థలంలో మాత్రమే వాహనాలు ఉంచాలన్నారు.షాపుల ముందు నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హోటళ్లు, స్కూళ్లు, కళాశాలలు, లాడ్జీలు, రెస్టారెంట్లు,సినిమా హాళ్ల వద్ద తప్పని సరిగా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే పోలీసులు పబ్లిక్ న్యూసెన్స్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.